

మరో అవకాశం ఇవ్వండి

ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ వికారాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. 10లో▸



'గ్యారంటీ'తో అధికారం

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల స్కీంతో అధికారం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. 11లో▸



నేతలను అడ్డుకుంటే కేసులే

ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను అడ్డుకుంటే కేసులు తప్పవని ధారూరు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. 11లో▸

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో పూడూరు మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

శేష వాహనంపై విహరించిన పద్మనాభుడు



శేష వాహనంపై విహరిస్తున్న స్వామివారు

అనంతగిరి: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలంపల్లి అనంత పద్మనాభ స్వామి బుధవారం రాత్రి శేష వాహనంపై విహరించారు. ఆలయ మఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

హంస వాహన సేవలో శ్రీవారు



హంస వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాసంఘాల నాయకులు డిమాండ్



కోర్టు వద్ద ప్రజా సంఘాల నాయకులు


తాండూరు టౌన్: గతంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఆందోళనలో కేసులు నమోదైన పలు ప్రజా, కుల, విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం కోర్టుకు హాజరయ్యారు. ఆర్టీసీ సంక్షేమం కోసం చేసిన ఆందోళనలో పాల్గొన్న టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఆర్టీసీ టీఎంయూ తాండూరు గౌరవాధ్యక్షుడు, కౌన్సిలర్ సోమశేఖర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పీ శ్రీనివాస్, విద్యార్థి నాయకుడు దీపక్ రెడ్డిలపై కేసులు నమోదయ్యాయి. వారు కోర్టుకు వచ్చిన సందర్భంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులపై అణచివేత పెరిగిపోయిందని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం చేస్తున్న పోరాటంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం

షాద్‌నగర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి బుధవారం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. అమెరికా గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ, అంతర్జాతీయ ఫిలంత్రోఫిక్ సొసైటీ, శ్రీశ్రీ కళావేదిక, పుడమి సాహితీ వేదిక, మహారాష్ట్ర, తమిళనాడు, ఏపీ, పాండిచ్చేరి తెలుగు అసోసియేషన్లు సంయుక్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి జాతీయ పురస్కారాలను అందజేశాయి.

సందడే సందడి





ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

- పల్లెబాట పట్టిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు
- రేసులో వెనుకడిన బీజేపీ
- టికెట్ ఎవరికనేదానిపై కొరవడిన స్పష్టత
- దరఖాస్తు చేసుకున్న ముగ్గురు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల సందడి మొదలైంది. టికెట్ దక్కించుకున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ఆరు గ్యారంటీ పథకాలను ఆయుధంగా చేసుకొని ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ మొదటి జాబితాలోనే టికెట్ దక్కించుకున్న ప్రసాద్ కుమార్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో మొట్టమొదటగా జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించి జోరు మీదున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలవుతాయని ప్రజలకు వివరిస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారంలో దూసుకుపోతుండగా బీజేపీ రేసులో వెనుకబడింది. ఈ పార్టీ అభ్యర్థి ఎవరనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు.

కమలం నాయకుల్లో అయోమయం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు కావస్తున్నా వికారాబాద్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత లేకపోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. రెండు నెలల క్రితం వరకు వికారాబాద్ బీజేపీ టికెట్ ఆశించిన మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరి జహీరాబాద్ టికెట్‌ను దక్కించుకున్న విషయం తెలిసిందే. ఆయన పార్టీని వీడటంతో వికారాబాద్‌లో బలమైన నాయకుడు లేకుండా పోయారు. చంద్రశేఖర్ పార్టీ మారడంపై బీజేపీ శ్రేణులను సైతం తీవ్ర నిరాశకు గురిచేసింది. 2018 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రశేఖర్ సుమారు 20వేల పైచిలుకు ఓట్లను సాధించారు. అప్పటి బీజేపీ అభ్యర్థి కేవలం రెండు వేల ఓట్లు మాత్రమే సాధించారు. సాధారణ ఎన్నికల అనంతరం చంద్రశేఖర్ బీజేపీలోకి రావడంతో పార్టీకి కొంత బూస్టింగ్ ఇచ్చినట్లయింది. ప్రస్తుత ఎన్నికల్లో వికారాబాద్ బీజేపీ అభ్యర్థి చంద్రశేఖరేనని పార్టీ అధిష్టానం, ద్వితీయ శ్రేణి నాయకులు భావించారు. ఆర్థికంగా కూడా ఆయన బలంగా ఉండటంతో ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో బోణీ కొట్టడం ఖాయమని అనుకున్నారు. అయితే ఆయన బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడంతో గెలుపు ఆశలపై నీళ్లుచల్లినట్లయ్యింది.

టికెట్ ఆశిస్తున్న ముగ్గురు

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నవీన్‌కుమార్ తనకు టికెట్ ఇవ్వాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈయన చాలా కాలంగా పార్టీలో కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అయితే వికారాబాద్ బీజేపీలో మొదటి నుంచి రెండు గ్రూపులు ఉన్నాయి. ఈయన ఒక గ్రూపునకు దగ్గరగా ఉన్నారనే ప్రచారం ఉంది. నవీన్‌కుమార్‌కు టికెట్ ఇస్తే వ్యతిరేక వర్గం మద్దతు ఇస్తుందా లేదా అనే అనుమానం లేకపోలేదు. అదే విధంగా పటాన్‌చెరువు నియోజకవర్గం సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ సహదేవ్ వికారాబాద్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రాంతానికి ఈయన కొత్త వ్యక్తి కావడంతో టికెట్ వస్తే పార్టీ శ్రేణులు ఎలా రియాక్టు అవుతారో చూడాల్సి ఉంది. అదేవిధంగా వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు కెరెల్లి ఆనందం కూడా బీజేపీ టికెట్ ఆశిస్తున్నారు. వికారాబాద్ ఎస్సీ నియోజకవర్గం కావడంతో టికెట్ కోసం పోటీ పెద్దగా లేకపోయినా ఎవరికి టికెట్ ఇస్తారనే దానిపై స్పష్టత లేదు.

గెలుపోటములపై ప్రభావం

గత ఎన్నికల్లో ఇతర ప్రాంతానికి చెందిన అభ్యర్థికి బీజేపీ టికెట్ కేటాయించడంతో పెద్దగా ప్రభావం చూపలేదు. 2018 ఎన్నికల్లో కేవలం 1,973 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన టీ సదానంద్ రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నియోజకవర్గంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించి 10వేల సభ్యత్వాలను నమోదు చేయించారు. ఈ పదివేల ఓట్లు కమలం అభ్యర్థికి పడాలనే పట్టుదలతో పార్టీ శ్రేణులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే గనుక జరిగితే అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ గెలుపోటములపై బీజేపీ ప్రభావం చూపే అవకాశం ఉంది. బీజేపీ పది వేల ఓట్లు సాధిస్తే ఎవరికి మేలు, ఎవరికి నష్టం అనే చర్చ జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రం వికారాబాద్‌లో బీజేపీకి మంచి పట్టు ఉంది. ఆ పార్టీ అభ్యర్థి ఎవరున్నా ఆ నష్టం జరుగకుండా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి.

పనిచేసే వారికే పట్టం కట్టండి

- నరేందర్‌రెడ్డి ప్రజల మనిషి
- భారీ మెజారిటీతో గెలిపించాలి
- మంత్రి మహేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలో పని చేసే నాయకునికే పట్టం కట్టాలని మంత్రి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొడంగల్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో వచ్చి పోయే వారిని నమ్మవద్దని సూచించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో కొడంగల్ నియోజకవర్గాన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తాము ప్రజల కోసం పనిచేసే వారిమన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. నిత్యం అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేసినట్లు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి గారడి మాటలు నమ్మి మోసపోరాదని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే సహించం

తాండూరు టౌన్: బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు అంటూ తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కొందరు పనిగట్టుకొని బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కార్యకర్తలు వెళ్తున్నారని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని నాలుగు స్థానాలతో పాటు చేవెళ్ల స్థానాన్ని కూడా బీఆర్‌ఎస్ దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా మంత్రిగా అందరినీ గెలిపించే బాధ్యత తనదేనన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్న కార్యకర్తలు ఒకప్పుడు ఆ పార్టీకి చెందిన వారేనని, కొత్తగా బీఆర్‌ఎస్ నుంచి వెళ్లే వారెవరూ లేరని స్పష్టం చేశారు. తాండూరులో పార్టీ సీనియర్ నాయకులంతా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వెంటే ఉన్నారని, అందరం కలిసికట్టుగా ఆయన్ను గెలిపించుకుంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తాండూరులో అభ్యర్థిని ప్రకటించలేని అధ్వాన స్థితిలో ఉందన్నారు. ఓర్వలేక కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటివి మానుకోకపోతే తీవ్ర చర్యలు తప్పవన్నారు. సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలన్నీ జనవరి నుంచి అమలవుతాయని అన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, రవిగౌడ్, పట్లోళ్ల నర్సింహులు, జగదీశ్వర్, సురేందర్ రెడ్డి, పరిమళ్, బిర్కట్ రఘు తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి



బతుకమ్మ వేడుక సభలో మాట్లాడుతున్న విమలక్క

బహుజన బతుకమ్మ కావాలి

- ప్రజాయుద్ధభేరి అధ్యక్షురాలు విమలక్క
- రేగడిమైలారంలో బతుకమ్మ సంబరాలు

బొంరాస్‌పేట: బహుజన బతుకుల్లో పండుగ సంతోషాలు నిండాలని ప్రజా యుద్ధభేరి అధ్యక్షురాలు విమలక్క ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని రేగడిమైలారంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బతుకమ్మను ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ పూల కవాతుగా.. స్త్రీల కవాతుగా ఊరూరా బహుజన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడపడుచుల ఆనందాల పండుగ బతుకమ్మను ఉన్నత వర్గాలకే పరిమితం కాకుండా బహుజనుల బతుకమ్మ కావాలని అన్నారు. పూల పండుగ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి ఆధారంగా పూల పండుగను నిర్వహించి పర్యావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే సందేశంతో, సామాజిక న్యాయం కోరుతూ బహుజన బతుకమ్మ సంబరాలు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం మత్తును చిత్తు చేస్తూ స్త్రీలపై అఘాయిత్యాలను ఎదిరిస్తూ బహుజన బతుకమ్మ సంబరాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు కూలి సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు రాజేశ్వరి, ఆర్‌పీఓడబ్ల్యూ పద్మ, దళిత ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్, రమేశ్‌బాబు, అరుణోదయ మల్సూర్, అనితాకుమారి, చెవిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా తనిఖీలు చేపట్టండి

- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి
- చెక్‌పోస్టుల సందర్శన

దౌల్తాబాద్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో కర్ణాటక - తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మండలంలోని చంద్రకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నగదు, మద్యం రవాణా చేస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం రవాణా కాకుండా చూడాలన్నారు. గోవా రాష్ట్రం నుంచి ఈ మార్గంలో మద్యం తరలించే అవకాశం ఉందని, గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ రాములు, ఏఎస్‌ఐ ముత్తురాజు, తహసీల్దారు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలి

కొడంగల్: సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం నియోజకవర్గంలోని కస్తూరుపల్లి చెక్‌పోస్టును ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక నుంచి డబ్బు, డ్రగ్స్, మద్యం జిల్లాలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి అనుసంధానం చేశారని, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటామని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద ఆబ్కారీ శాఖ అధికారులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు రూ. 8లక్షల 26వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల విభాగాన్ని పరిశీలించారు. అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలో 2 లక్షల 30వేల మంది ఓటర్లు ఉన్నారని, 275 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటరుగా నమోదు చేసుకోడానికి ఈ నెల చివరి వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ రాములు, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

బీఆర్‌ఎస్ నేతలకే పథకాలు

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

దోమ: ఎన్నికల హామీలు అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, దాదాపూర్, దిర్సంపల్లి, కొండాయపల్లి బ్రహ్మణపల్లి, బుద్లాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. బీఆర్‌ఎస్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు సక్రమంగా అమలు కాలేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రం లబ్ధి పొందారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొందపెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ యాదయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



దాదాపూర్‌లోని హోటల్‌లో టీ కాస్తున్న రామ్మోహన్‌రెడ్డి

ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్

- అన్ని వర్గాలను ఆకట్టుకున్న బీఆర్‌ఎస్ మేనిఫెస్టో
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- యాలాల మండలంలో ఎన్నికల ప్రచారం



లక్ష్మీనారాయణపూర్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అయ్యిందని, అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ మేనిఫెస్టో రూపొందించారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మరోమారు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. యాలాల మండల అభివృద్ధికి రూ.97.77 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జుంటుపల్లి రామస్వామి ఆలయ అభివృద్ధికి రూ. కోటి, సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.99 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. మల్‌రెడ్డిపల్లి, బాగాయిపల్లి, పేర్కంపల్లి తండా, దేవులా తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. కోకట్, దేవనూరు, గోవిందరావుపేట, బెన్నూరు శివారులో చెక్‌డ్యాంల నిర్మాణం, ప్రతి పంచాయతీకి రూ.50లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, వైస్ ఎంపీపీ రమేష్, పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సువిధ'లో ప్రచార అనుమతులు

ఆర్‌ఓ విజయకుమారి



పరిగి ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ విజయకుమారి

పరిగి: రాజకీయ పార్టీలు ప్రచారం చేపట్టేందుకు అనుమతులు తప్పక తీసుకోవాలని ఆర్‌ఓ విజయకుమారి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీల నాయకులు ఎన్నికల ప్రచార అనుమతులను సువిధ అనే యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఖర్చుల విషయం రికార్డు చేస్తామని కావున జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

కారు, బైక్ ఢీ..

యువకుడి మృతి

కొడంగల్ రూరల్: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గేట్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని బ్రాహ్మణ వాడకు చెందిన రాఘవేంద్రచారి కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక రాష్ట్రంలోని మల్కేడ్ గ్రామంలోని మఠానికి వెళ్లారు. కుటుంబ సభ్యులు అక్కడే ఉండగా కుమారుడు అక్షయచారి(23) బైక్ ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో కొడంగల్ నుంచి కర్ణాటక వైపు ప్రయాణిస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అక్షయచారి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిమెంట్ లారీని ఢీకొట్టిన బైక్

మహిళా కండక్టర్ మృతి

మోమిన్‌పేట: రోడ్డు పక్కన నిలిపిన సిమెంట్‌లారీని బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల పద్మ(40) లింగంపల్లి బస్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే విధులకు వెళ్తుండగా కుమారుడు శివకుమార్ బైక్‌పై సదాశివపేటలో దింపేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మేకవనంపల్లి తండా గేటు వద్ద సిమెంట్‌లారీ మరమ్మతులు రావడంతో రోడ్డు పక్కన నిలిపారు. లారీని గమనించని శివకుమార్ వెనకనుంచి ఢీకొట్టడగా బైక్ ఉన్న పద్మకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. శివకుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

అనంతగిరి: ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన వికారాబాద్ మండలంలోని పులుమద్ది, ఎర్రవల్లి, నారాయణపూర్, అత్వెల్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ శ్రేణులు బతుకమ్మలు, బోనాలతో, ఎండ్లబండ్లపై స్వాగతం పలికారు. వివిధ పార్టీల నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల దీవెనలతో ఐదేళ్ల పాటు జిల్లా అభివృద్ధికి కృషి చేశానన్నారు. ప్రజలు ఎక్కడికి వెళ్లినా ఆదరిస్తున్నారని.. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేద మహిళలకు రూ.3వేల పెన్షన్ అందించే మరో నూతన పథకానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సంక్షేమ పథకాలనే మనలను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్, వెంకటయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్శితులై నాయకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలువార్డులకు చెందిన, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, యువకులు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన సాధ్యమన్నారు. కలిసికట్టుగా పనిచేసి విజయాన్ని సాదిద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ కృష్ణారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నారాయణపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐదు వారాలు కష్టపడండి

- ఐదేళ్లు అందుబాటులో ఉంటాడు
- మరోసారి పైలెట్ రోహిత్‌రెడ్డిని గెలిపించాలి
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

తాండూరు రూరల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఐదు వారాలు కష్టపడి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని గెలిపిస్తే.. ఐదేళ్లు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తాడని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు మండలంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణాలో ఉన్నాయన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ గెలిస్తే.. ప్రపంచఖ్యాతి పొందే అవకాశం ఉందన్నారు. ప్రతీ కార్యకర్త తానే రోహిత్‌రెడ్డిగా గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని కోరారు. బీఆర్ ఎస్ ప్రజాదరణ చూడలేక కాంగ్రెస్ నాయకులు ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ప్రాణమున్నంత వరకు ప్రజాసేవ: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ప్రాణమున్నంత వరకు తాండూరులో ప్రజాసేవ చేస్తానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. పరాయి నాయకులను నమ్మొద్దని.. మీ ఇంటి బిడ్డనైన నన్ను నమ్మితే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా న్నారు. నాన్‌లోకల్ అభ్యర్థులకు అవకాశం ఇస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రూ.400లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు సౌభాగ్య లక్ష్మీ, కేసీఆర్ బీమా, ఆసరా, రైతుబంధు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మంజుల, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూపారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, రైతుబంధు కన్వీనర్ రాంలింగారెడ్డి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు శకుంతల, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హస్తం గూటికి గులాబీ నేతలు



ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని బార్వాద్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రసాద్‌కుమార్ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వికారాబాద్ గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్వాద్ ఎంటీపీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, నాయకులు రాచిరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రాజకీయ నేతల అవగాహన సమావేశంలో డీఎస్పీ నర్సింలు



మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింలు

మోమిన్‌పేట: సాధారణ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకకు రాజకీయ నేతలతంఆ సహకరించాలని డీఎస్పీ నర్సింలు కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు, ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఐదేళ్లకోసారి వస్తుంటాయి. మనమంతా కలిసి జీవిస్తుంటాం బేషరతులకు వెళ్లి కేసులు నమోదు చేసుకోవద్దన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు రెచ్చగొట్టే మాటలు, సోషల్ మీడియాలో పోస్టులు చేయడం తదితరాలు చేయవద్దని సూచించారు. ఎవరికి నచ్చిన వ్యక్తికి, పార్టీకి ఓటు వేసే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని అలాంటప్పుడు ఎవరిపై ఒత్తిడి చేయవద్దన్నారు. సమాజానికి హాని కల్గించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాలీలు, సమావేశాలు, మైకు వాడటం, వాహనాలను వినియోగించడం లాంటి పనులకు ముందస్తుగా ఆర్‌ఓ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు వ్యక్తులు ఆస్తులలో పార్టీ జెండాలు, ప్లెక్సీల ఏర్పాటుకు యాజమానుల అనుమతులు తప్పనిసరన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఎంపీఓ యాదగిరి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు ఉత్తమ అవార్డు



జాతీయ సేవారత్న అవార్డు అందుకుంటున్న మహమ్మద్ అజారుద్దీన్

పూడూరు: సామాజిక సేవలకు గాను పూడూరు మండలం చన్గోముల్ గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహమ్మద్ అజారుద్దీన్ జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ మేరకు బుధవారం అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఢిల్లీలో జాతీయ సేవారత్న అవార్డును అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో విశేష సేవలు అందించినందుకు అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, నాయకులు అజీమోద్దీన్, రాంరెడ్డి, హకీం, ప్రభాకర్‌గుప్తా, శేఖర్‌గౌడ్, లక్కం సత్యనారాయణ, బాలయ్య, రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- విద్యార్థుల రాష్ డ్రైవింగ్‌తో ఆగిపోయిన ఐదేళ్ల ప్రయాణం
- కళాశాల ఎదుట గ్రామస్తుల ధర్నా



రాజు(ఫైల్)



శ్రీశైలం(ఫైల్)

శంకర్‌పల్లి: ఇద్దరు మిత్రుల ఐదేళ్ల ప్రయాణం విద్యార్థుల రాష్ డ్రైవింగ్‌తో ఆగిపోయింది. నిమిషాల వ్యవధిలోనే ఇరువురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన బుధవారం మోకిల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని జనవాడకు చెందిన బ్యాగరి రాజు(40) శేరిలింగంపల్లిలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్, మోత్కుపల్లి శ్రీశైలం(31) ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి. రోజు మాదిరిగానే వారు బైక్‌పై విధులకు బయలుదేరారు. గ్రామ శివారులోకి కొల్లూరు రోడ్డులో ఇక్ఫాయి కళాశాల విద్యార్థులు అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో రాజు ఘటనాస్థలిలోనే మృతి చెందగా.. శ్రీశైలంను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచాడు. రాజుకు భార్య మమత, ముగ్గురు సంతానం. శ్రీశైలంకు ఏడాదిన్నర క్రితం సంధ్యతో వివాహమైంది. మృతదేహాలను చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఇద్దరు మిత్రుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


కళాశాల ఎదుట ధర్నా

మృతుల కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని.. ప్రమాదానికి కారణమైన విద్యార్థులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ శంకర్‌పల్లి–హైదరాబాద్ ప్రధాన రహదారిపై కార్ రేసింగ్ నిర్వహించి ఓ మహిళ ప్రాణాలను బలిగొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు గంజాయి, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోకిల సీఐ నరేశ్, శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి కళాశాల వద్దకు చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో పోటీలు

అనంతగిరి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా పరిధిలోని విద్యార్థులకు, యువతకు, ఫొటోగ్రాఫర్లకు, షార్ట్ ఫిల్మ్‌కు సంబంధించి తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా షార్ట్ ఫిల్మ్ మూడు నిమిషాల నిడివి ఉండాలని సూచించారు. వీడియోలు, ఫోటోలు ఈనెల 22లోపు ఎస్పీ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీచింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధించి ఉండాలన్నారు. గతేడాది నవంబర్ నుంచి ఈ సంవత్సరం అక్టోబర్ వరకు తీసిన ఫోటోలై ఉండాలన్నారు.

12 కిలోల గంజాయి సీజ్



పట్టుకున్న గంజాయితో జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ నవీన్‌చంద్ర

అనంతగిరి: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మరకు వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించగా బుధవారం 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ నవీన్‌చంద్ర తెలిపారు. మధ్యాహ్నం తనిఖీల్లో భాగంగా 3వ నంబర్ ప్లాట్ ఫాంపై పలు వస్తువులను పరిశీలిస్తున్న క్రమంలో సంచుల్లో గంజాయి లభించిందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ రాఘవీణ, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నిస్వార్థ సేవలకు గౌరవం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న భీంరెడ్డి

కుల్కచర్ల: నిస్వార్థమైన సేవలకు ఎప్పుడైనా గుర్తింపు, గౌరవం లభిస్తాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, దళిత సంఘాల నాయకులు కనకం మొగులయ్య అన్నారు. మూడు రోజుల క్రితం కుల్కచర్ల గ్రామానికి చెందిన కర్రె భరత్ కుమార్‌కు జాతీయ అంబేద్కర్ అవార్డు వరించింది. దీంతో ఆయన్ను ఆయా సంఘాల నాయకులు భరత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నాయక్, రాములు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్‌కు రిమాండ్

రూ.3లక్షల విలువైన 12.5కిలోలు గంజాయి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు: ఆంధ్రప్రదేశ్ నుంచి కర్నాటకు గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్‌ను ఆమనగల్లు పోలీసులు, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. బుధవారం ఆమనగల్లు పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ జె.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గ్రామానికి చెందిన బైరి శ్రీనివాస్ ఏపీలోని వైజాగ్ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. స్మగ్లర్ శ్రీనివాస్ ఏజెన్సీకి చెందిన శ్రీలత నుంచి 12.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరు ప్రాంతానికి చెందిన ఉమేశ్‌కు విక్రయించేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్దనున్న సూట్ కేస్‌లో గంజాయి లభ్యమైంది. దీంతో కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని.. శ్రీలత, ఉమేశ్‌లు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం, ఏఎస్‌ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, సిబ్బంది ఉన్నారు.

శరణ్య ఎక్కడమ్మా..?

- కన్న పేగుకోసం తల్లి తండ్లాట
- భర్తపైనే అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్: మానవత్వం మంటగలుస్తోంది.. తాగుడు బానిసైన తండ్రిని ఏడాదిన్నర పాప వద్ద ఉంచి పనికి వెళ్తే పాపనే కనపడకుండా చేశాడు ఆ కసాయి. దీంతో ఆతల్లి బిడ్డ ఆచూకీ కోసం తల్లిడిల్లుతోంది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లికి చెందిన పద్మ, బోవయ్య దంపతులకు ఒక బాబు, పాప సంతానం. భర్త తాగుడుకు బానిసవ్వడంతో పద్మ హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు పనికి వెళ్లి రాత్రి ఒంటిగంటకు వస్తుంది. ఆమె ఎప్పటిలాగే మంగళవారం పిల్లల వద్ద తండ్రిని ఉంచి పనికి వెళ్లింది. రాత్రి 11గంటలకు హోటల్ వద్దకు వెళ్లిన బోవయ్య పిల్లలు ఏడుస్తున్నారని పద్మను ఇంటికి రమ్మన్నాడు. ఇంటికి వచ్చిచూస్తే కూతురు శరణ్య(18నెలలు) కనిపించలేదు. దీంతో పాప ఎక్కడఅని భర్తను నిలదీసింది. బైపాస్ సమీపంలోని చెట్ల పొదల్లో పడవేశా.. చెరువులో వేశా.. అంటూ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పద్మ పోలీసులను ఆశ్రయించింది. భర్తపైనే అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు బైపాస్ సమీపంలోని చెట్ల పొదలు, చెరువులో గాలించినా పాప ఆచూకీ లభించలేదు. తాగుడుకు బానిసైన తండ్రి పాప ఎవరికైనా విక్రయించాడా..? హత్యచేసి మరెక్కడైనా పడవేశాడా, భార్యాభర్తలమధ్య కలహాలున్నాయా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ రాంరెడ్డి తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

- ఒక ఆటో, పది బైక్‌లు స్వాధీనం
- ఇద్దరు నిందితులకు రిమాండ్

అబ్దులపూర్‌మెట్: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా కోటపహాడ్ మండలానికి చెందిన మచ్చ రూపేశ్ వనస్థలిపురంలో నివసిన్నాడు. రూపేశ్, బండారి శివ(బైక్ మెకానిక్) ముఠాగా ఏర్పడి పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 17న దొంగిలించిన బైక్‌పై ప్రయాణిస్తుండగా పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద పోలీసులకు చిక్కారు. దీంతో వారిని లోతుగా విచారింగా పది బైక్‌లు, రూ.10.40లక్షల విలువైన ఒక ఆటో ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి వాహనాలు రికవరీ చేశారు. ఈ సమావేశంలో ఏసీపీ భీంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రజలు మోసపోవద్దు



చటాన్‌పల్లి ప్రచారంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

- సంక్షేమ పాలన కొనసాగింపునకు 'కారు'కు ఓటేయండి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ఎన్నికలు అనగానే బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజలను మభ్య పెట్టేందుకు గ్రామాలకు వస్తారని ప్రజలు మోసపోవద్దని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రజలు మరోసారి కారు గుర్తుపై ఓటేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశం దృష్టిని ఆకర్శిస్తున్నాయన్నారు. బడుగుల అభ్యున్నతి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. పల్లెలు, పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్ పాల్గొన్నారు.

'గులాబీ' గూటికి 'కమలం'నేతలు

జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీకి చెందిన నాయకులు ముర్షద్ మురళి, నర్సింలు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.